


'సన్న'గిల్లిన సాగు

- దొడ్డు రకం వరి వైపే రైతుల మొగ్గు
- వానాకాలంలో 80 శాతం సన్నరకాల సాగు
- యాసంగిలో సీన్ రివర్స్
- 20 శాతానికే పరిమితం
- దిగుబడి సరిగా రాకపోవడమే ప్రధాన కారణం!

కాటారం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. వానాకాలంలో సన్న రకాల వరిని పండించుకున్న భూపాలపల్లి జిల్లా అన్నదాతలు ఈసారి అందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం బోనస్ ఇస్తున్నా దిగుబడులు సరిగా రావడం లేదని యాసంగిలో సన్న రకాలు వేసుకోవడం లేదు. మునుపటిలా మళ్లీ దొడ్డు రకాలకే మొగ్గు చూపుతున్నారు. వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 1.12లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు అయ్యింది. 91 వేలకు పైగా ఎకరాల్లో (80శాతానికి పైగా) సన్నాలనే రైతులు సాగు చేసుకున్నారు. యాసంగి సీజన్‌లో మాత్రం 80శాతానికి పైగా దొడ్డు వడ్లు, హైబ్రిడ్ రకం సాగు చేసుకుంటున్నారు. జిల్లాలో సుమారు 85వేల ఎకరాల్లో యాసంగి వరి సాగు కానుండగా 69వేలకు పైగా ఎకరాల్లో దొడ్డు రకం వడ్లు, ఆడ, మగ రకం సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. కాటారం మండలంలో యాసంగిలో 9-10వేల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా. ఇందులో సుమారు 8వేల ఎకరాల్లో దొడ్డు, మేల్, ఫీమేల్ రకాలు సాగు కానుంది.

సర్కారు బోనస్ ఇస్తున్నా...

రైతు భరోసా పథకంలో భాగంగా సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇస్తోంది. అయినప్పటికీ రైతులు దీనిపై విముఖత చూపుతున్నారు. సన్న రకాలు కాదని, దొడ్డు రకం వడ్లకే జైకొడుతున్నారు. యాసంగిలో సన్న రకాలకు తెగుళ్లు అధికంగా రావటం, సరైన దిగుబడులు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. యాసంగిలో దొడ్డు వడ్ల దిగుబడులు బాగా పెరిగే అవకాశం ఉండటంతో వాటి సాగుకే మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది.

ప్రైవేట్ కంపెనీల రకాల వైపు మొగ్గు

యాసంగి వరి సాగులో రైతులు రీసెర్చ్ సీడ్ అందించే ప్రైవేట్ కంపెనీల వడ్ల రకాల వైపే మొగ్గు చూపుతున్నారు. అధిక శాతం మంది ప్రైవేట్ విత్తన కంపెనీలకు చెందిన 10కిలోల సంచులను, కొందరు ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థలు అందించే 25కిలోల విత్తనాలు సంచులు కొనుగోలు చేసి నార్లుగా పోసి నాట్లు వేయిస్తున్నారు. జిల్లాలో సుమారు 40 రకాలకు పైగా వడ్ల రకాలు సాగవు తుండగా ప్రభుత్వ రంగ సంస్థలు సరఫరా చేసే దొడ్డు రకం వడ్లు జేజీఎల్-24423, కేఎన్ఎం-118, ఎంటీయూ-1010, 1153, 1156, సన్నరకం ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా)తో పాటు ప్రైవేట్ సంస్థకు చెందిన మహీంద్రా-404, సిరి-12కా4, సమ్రాట్, బాహుబలి, గోల్డ్-78, కావేరి-99, నాథ్-2020, జీనోమిక్స్-2311, 2312, సత్యం ధృవ, అంకుర్ ఏకవీర తదితర దొడ్డు వడ్ల రకాలను రైతులు సాగు చేస్తున్నారు.

వేలాది ఎకరాల్లో ఫీమేల్ వడ్ల సాగు

సన్న రకాల వడ్లకు మార్కెటింగ్‌లో ఇబ్బందులు తలెత్తడం, యాసంగిలో సన్నరకాల దిగుబడులు ఆశించిన మేర రాకపోవడం, మిల్లింగ్ చేసిన రా రైస్ సరిగా రాని పరిస్థితి ఎదురు కావడంతో రైతులు దొడ్డు రకాలపై ఆసక్తి చూపుతున్నారు. దొడ్డు రకాల వడ్ల విక్రయాలకు ఇబ్బంది ఉండదని భావించి వాటికి ప్రాధాన్యమిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నా ప్రైవేట్ వ్యాపారులకు అమ్మేయొచ్చని అన్నదాతలు ఆలోచిస్తున్నారు. జిల్లాలో బోర్లు, బావులు, చెరువులు, కుంటల కింద వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పలువురు రైతులు నాట్లు వేయిస్తుండగా, కొందరు రైతులు వడు వెదజల్లే పద్ధతి (బ్రాడ్‌కాస్టింగ్ మెథడ్)లో వరిని సాగు చేస్తున్నారు. కొద్దిగా మొలకెత్తిన వడ్లను పొలంలో చల్లే ప్రక్రియ జోరుగా జరుగుతోంది.

సన్నాల సాగుకు ఖర్చు ఎక్కువ

దొడ్డు వడ్ల వెరైటీలతో పోలిస్తే సన్నరకం వరి సాగుకు పెట్టుబడి అధికమవుతుంది. సన్న రకాలకు తెగుళ్లు, చీడపీడల బాధ ఎక్కువగా ఉంటుండగా నివారణ, నియంత్రణ కోసం పురుగు మందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. దొడ్డురకం వరి దిగుబడితో పోలిస్తే సన్న రకాలు తక్కువ దిగుబడినిస్తాయి. దీంతో అన్నదాతలు దొడ్డు రకాల వైపే మొగ్గు చూపుతున్నారు. క్వింటాల్‌కు రూ.500 చొప్పున ప్రభుత్వం బోనస్ ఇస్తున్నా సన్నాల సాగుకు ఆసక్తి చూపడం లేదు.

నగరం.. ఆధ్యాత్మిక సౌరభం



- ఓరుగల్లులో నేత్రపర్వంగా శోభాయాత్ర
- ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తరలివచ్చిన భక్త కళాకారులు
- అలరించిన భక్తి కళాప్రదర్శనలు
- హిందూ ధార్మిక విలువలను విస్తరింపచేద్దాం.. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి
- వరంగల్ కేంద్రంగా సంకీర్తన మండలికి శ్రీకారం

వివరాలు 7లో..

గాంధీ విగ్రహానికి వినతిపత్రం.. బీఆర్ఎస్ వినూత్న నిరసన

వివరాలు 8లో



భూపాలపల్లిలో క్రీడాకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

నష్టపోకుండా న్యాయం చేస్తాం

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులతో ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూమి కోల్పోతున్న రైతులు నష్టపోకుండా న్యాయం చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హామీ ఇచ్చారు. గురువారం మండల కేంద్రంలో రైతులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలను విన్నవించుకున్నారు. దీంతో ఆయన కలెక్టర్ రాహుల్‌శర్మతో ఫోన్‌లో మాట్లాడారు. మొగుళ్లపల్లి, ఇస్సిపేట, రంగాపురం గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతులకు నష్టం లేకుండా న్యాయం జరిగేలా చూస్తానని, రైతులకు విడతల వారీగా డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. అలాగే మండలంలో వివిధ కారణాలతో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు సంపెల్లి నర్సింగరావు, ఆకుతోట కుమారస్వామి, ఎమ్మీ. రవి, తక్కళ్లపల్లి రాజు, ఖ్యాతరాజు రమేష్, ఎర్రబెల్లి పున్నం చందర్ రావు, సుదర్శన్, మోటె ధర్మారావు, శివారెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

భూపాలపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో జరిగిన జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లోని పాల్గొని గెలుపొందిన క్రీడాకారులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సన్మానించారు. మన జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలలో కందికట్ల వైష్ణవి, ఈరవేణి అంజలి, రిజ్వానా, గన్నంపెల్లి హాసినీని అభినందించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి రఘు, సైక్లింగ్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రాజమౌళి, పీడీ మమత, సెక్రటరీ ఆనంద్, కోశాధికారి సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

పదవి విరమణతో ప్రశాంత జీవనం

భూపాలపల్లి కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు పదవి విరమణతో ప్రశాంత జీవనం గడపాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణరావు అన్నారు. భూపాలపల్లి మండల ఎంపీడీవోగా పని చేసిన మహ్మద్ ఇక్బాల్ హుస్సేన్ ఉద్యోగ విరమణ పొందగా వీడ్కోలు కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆట్టహాసంగా గురువారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఇన్నాళ్లు ఇక్కడ పనిచేసిన ఇక్బాల్ హుస్సేన్ వివాదాలకు తావులేకుండా పని చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు, తహసీల్దార్ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు దాట్ల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్‌తోపాటు మండలంలోని ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మునిసిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్

భూపాలపల్లి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపల్ కమిషనర్‌గా బిర్రు శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన రాజేశ్వర్ ఇటీవల వరంగల్‌కు బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో శ్రీనివాస్‌ను నియమించారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన అదనపు కలెక్టర్ విజయలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

← బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

మాదిగలు కదం తొక్కాలి

సినీగేయ రచయిత మిట్టపల్లి




సమావేశంలో మాట్లాడుతున్న సినీగేయ రచయిత సురేందర్

చిట్యాల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించనున్న వెయ్యి గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమానికి మాదిగలు కదం తొక్కాలని సినీగేయ రచయిత మిట్టపల్లి సురేందర్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలనుసారం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్గీకరణను అడ్డుకోవడం సరికాదన్నారు. వెయ్యి గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి మద్దతుగా నిలవాలని కోరారు. ఈసమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ రాష్ట్ర, జిల్లా నాయకులు పుల్ల శ్రీనివాస్, పుట్ట భిక్షపతి, ఏకు శంకర్, డప్పు రవి, నేరెళ్ల ఓదెలు, దొడ్డె శంకర్, కట్కూరి మొగిలి, పుల్ల ప్రతాప్, దాసారపు నరేష్, గోల్కొండ సురేష్, పుల్ల సతీష్, వంశీ, ఆరెపెల్లి తిరుపతి, రాజపోశయ్య పాల్గొన్నారు.

కుంభాభిషేకానికి రండి

తపోవన పీఠాధిపతి సచ్చిదానంద స్వామికి కాళేశ్వరాలయం ఈవో ఆహ్వానం



తపోవన పీఠాధిపతికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న కాళేశ్వరాలయ ఈవో మహేష్ తదితరులు

మహదేవపూర్, జనవరి 30 : మండలంలోని కాళేశ్వరంలో ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న కుంభాభిషేకం కార్యక్రమానికి హాజరు కావాలని తుని తపోవన పీఠాధిపతి సచ్చిదానంద స్వామిని ఆహ్వానించారు. దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు కాళేశ్వరాలయం ఈవో మహేష్, ఉప ప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్రశర్మ తునిలోని మఠానికి వెళ్లి ఆహ్వాన పత్రికను గురువారం అందజేశారు. వీరి వెంట దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.



రైల్వే డీఆర్ఎం భరతేష్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రైల్వే డీఆర్ఎంను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

కాజీపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే భవన్‌లో గురువారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్‌ను, ఏడీఆర్ఎం ఎం.గోపాల్‌ను కలిశారు. కాజీపేటలో నిర్మించ తలపెట్టిన బస్టాండ్‌పై చర్చించారు. సాధ్యమైనంత త్వరగా బస్టాండ్ స్థలాన్ని అప్పగిస్తే, శంకుస్థాపన పనులు చేపడుతామని కోరారు. అనంతరం బస్టాండ్ స్థల మ్యాప్‌ను పరిశీలించారు. బస్టాండ్ స్థలాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. బస్టాండ్ ప్రతిపాదనలు త్వరలో రైల్వే బోర్డుకు పంపిస్తామని డీఆర్ఎం చెప్పినట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఎండీ అంకూస్ ఉన్నారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు పతకం



బంగారు పతకం సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ నవీన్ (మధ్యలో ఉన్న వ్యక్తి)

వరంగల్ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ కుస్తీ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం గెలుచుకుంది. కరీంనగర్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో ఏఆర్ కానిస్టేబుల్ నవీన్ 97 కిలోల ఫ్రీస్టైల్ విభాగంలో హైదరాబాద్ కమిషనరేట్‌కు చెందిన క్రీడాకారుడిపై విజయం సాధించి నవీన్ వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తొలి బంగారు పతకాన్ని సాధించి పెట్టాడు. ఈ సందర్భంగా నవీన్‌ను సీపీ అంబర్ కిషోర్ ఝా, జట్టు మేనేజర్ నాగయ్య అభినందించారు.

పిల్లలను ఉత్తములుగా తీర్చిదిద్దాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కుసుమ శ్రీనివాస్

హనుమకొండ కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుకునేందుకు పాఠశాలతో పాటు, ప్రత్యేక శిక్షణ అవసరమని సన్మార్గం, సత్ప్రవర్తన శిక్షణ ప్రధాన పర్యవేక్షకుడు కుసుమ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన కొలనుపాక సుమన్ శాస్త్రితో కలిసి యాదవ నగర్‌లో వేసవికాలంలో నిర్వహించే శిక్షణ శిబిరం వివరాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 20 వరకు అడ్మిషన్లు కొనసాగుతాయని, జూన్ 11వ తేదీ నుంచి 41 రోజులు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 10 ఏళ్ల నుంచి 14 ఏళ్ల మగ పిల్లలకు మాత్రమే ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో శ్రద్ధ తీసుకొని శిబిరానికి పంపిస్తే చక్కని క్రమశిక్షణతో పాటు ఆధ్యాత్మిక చింతన, విద్య పట్ల ఆసక్తి, కళల పట్ల మక్కువ కలిగేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తామని కుసుమ శ్రీనివాస్ చెప్పారు. వివరాల కోసం 9849267993 మొబైల్‌లో సంప్రదించాలని సూచించారు.

డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

- షీటీమ్ ఫిర్యాదులపై సున్నితంగా వ్యవహరించాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి
- ఆర్గనైజేషన్, హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా, చిత్రంలో సీపీ అంబర్ కిశోర్ ఝా, పోలీసు అధికారులు

వరంగల్ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : డయల్ 100 ద్వారా వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి వీలైనంత తొందరగా చేరుకోవాలని ఆర్గనైజేషన్ అండ్ హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఉదయం పోలీసు అతిథి గృహానికి చేరుకున్న అడిషనల్ డీజీపీకి సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సాయుధ బలగాలు గౌరవవందనం చేశారు. తనిఖీల్లో భాగంగా కమిషనరేట్ కార్యాలయానికి చేరుకొని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకుంటున్న ముందస్తు చర్యలపై సీపీ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

అనంతరం డీజీపీ స్వాతి లక్రా మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం ఏర్పాటైన షీటీమ్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు షీ టీమ్‌లో ఇచ్చే ఫిర్యాదులను అధికారులు సున్నితంగా పరిష్కరించాలన్నారు. బాధితులకు న్యాయం కల్పించడంతో పాటు నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదులపై తప్పనిసరిగా కేసు నమోదు చేయాలన్నారు. స్టేషన్ అధికారులకు భరోసా కేంద్రం పనితీరు తెలిసేలా కేంద్రాన్ని సందర్శించి అక్కడి కార్యకలాపాలను తెలుసుకోవాలన్నారు. ట్రాఫిక్, మత్తు పదార్థాలు, ర్యాగింగ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కళాశాలల్లో సేఫ్టీ ఉమెన్, సేఫ్టీ ట్రాఫిక్, యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ క్లబ్‌లను ఏర్పాటుచేసి సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. జాగృతి కళాబృందం ద్వారా ప్రజలకు నష్టం కలిగే అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. బాల నిర్మూలన కోసం నిరంతరం తనిఖీలు కొనసాగించాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న కమిషనరేట్ భవనంతో పాటు రిజర్వుడ్ ఆయుధాగారంతోపాటు డాగ్ స్క్వాడ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు సలీమా, రవీందర్, రాజ మహేంద్ర నాయక్, అదనపు ఎస్పీలు చేతన్, మనాన్ భట్, ఏఆర్ అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

బీసీలు రాజకీయాలను శాసించాలి

పద్మశాలీ సంఘం జాతీయ నేత ఈగ మల్లేశం



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఈగ మల్లేశం, శ్రీరాములు, సమ్మారావు

వడ్డెపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బీసీలు రాజకీయాలను శాసించి రాజ్యాధికారాన్ని చేపట్టి హక్కులను సాధించుకోవాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ పూర్వ అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తరతరాలుగా ఆధిపత్య కులాల పాలకులు బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా అణగదొక్కడానికే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను తెచ్చి తీరని అన్యాయం చేశారని దుయ్యబట్టారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రాష్ట్రంలోని 60 లక్షల మంది నిరుద్యోగులకు శాపంగా మారాయన్నారు. కేవలం మూడు శాతం ఉన్న ఓసీ కులాలకు 10 శాతం, 65 శాతం ఉన్న బీసీలకు 29 శాతం రిజర్వేషన్లు మాత్రమే అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రాష్ట్రనేత గుండు ప్రభాకర్ మాట్లా డుతూ.. బీసీల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల దృష్టి కి తీసుకెళ్లేందు కోసం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వం లో ఫిబ్ర వరి 2న హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో మధ్యా హ్నం 2గంటలకు నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు రాజకీయాలకతీతంగా అన్ని బీసీ కులాలతో పాటు పద్మశాలీ కులస్థులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పద్మశాలీ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వడ్నాల నరేందర్, చంద మల్లయ్య, బచ్చు ఆనందం, దుస్స శివశంకర్, ఆడెపు రవీందర్, చిప్ప వెంకటేశ్వర్లు, శామంతుల శ్రీనివాస్, బేతి అశోక్, మేడారపు సుధాకర్, గాడి పల్లి రాజేశ్వర్‌రావు, బైరి శ్రీనివాస్, పరికిపండ్ల వేణు, జానకిరాములు, బీ రమేష్, శివశంకర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఐలాపూర్ జాతర పనులు పూర్తి చేయాలి

అధికారులతో ములుగు కలెక్టర్ దివాకర



ఐలాపూర్‌లో గద్దెల ప్రాంగణంలో జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ములుగు జిల్లా కలెక్టర్ దివాకర

కన్నాయిగూడెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్‌లో ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ దివాకర ఆదేశించారు. గురువారం ఆయన ఐలాపూర్‌లో పర్యటించారు. భక్తులకు మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాల కోసం చేపడుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా జాతర పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం వనదేవతలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు మల్లెల రవి, మాజీ సర్పంచ్ మల్లెల లక్ష్మయ్య, వీరేల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజుల ఆలయాన్ని సందర్శన

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయి, మాల్యాల, దొడ్ల గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. గోవిందరాజుల ఆలయాన్ని సందర్శించిన ఆయనకు సారలమ్మ ప్రధాన పూజారి, మాజీ సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు గిరిజన సాంప్రదాయ ప్రకారం స్వాగత పలికారు. అనంతరం గోవిందరాజుకు కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి ఆయా గ్రామాల్లోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి 12 నుంచి జరిగే మేడారం మినీ జాతర సందర్భంగా కొండాయిలోని గోవిందరాజుల ఆలయం వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాపై తప్పుడు ప్రచారం చేశారు

- ఏ ఉగ్రవాద సంస్థతో మాకు సంబంధం లేదు
- పోలీసులు విచారణ చేసింది వాస్తవమే..
- మా సంఘానికి క్లీన్ చిట్ ఇచ్చి పంపించారు
- ఆల్ ఇండియా జమాతే ముస్లిమి అధ్యక్షుడు జక్రియా

వరంగల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరిగిందని, తనకు, తమ సంఘానికి ఏ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు లేవని ఆల్ ఇండియా జమాతే ముస్లిమి జాతీయ అధ్యక్షుడు జక్రియా స్పష్టం చేశారు. గురువారం వరంగల్ చేరుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను 2021మార్చి నుంచి ఆల్ ఇండియా జమాతే ముస్లిమి సంఘానికి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానన్నారు. అయితే ఈ నెల 25వ తేదీన తాను శ్రీలంకకు వెళుతుండగా, చెన్నై ఎయిర్ పోర్టులో ఇమ్మిగ్రేషన్ వద్ద పోలీసులు తనను నిలిపి అదుపులోకి తీసుకున్నారని, రెండు రోజులు వారి అదుపులోనే ఉంచుకుని, ఫోన్, పాస్‌పోర్టు స్వాధీనం చేసుకున్నారన్నారు. రెండు రోజుల విచారణ తర్వాత తరువాత తమ సంఘానికి ఉగ్రవాదులతో ఎలాంటి సంబంధాలు లేవని క్లీన్‌చిట్ ఇచ్చారని వివరించారు. తమ సంఘం ప్రచారానికి ఎక్కడైనా పోవచ్చని అధికారులు పేర్కొన్నారని తెలిపారు. అయితే తనకు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నట్టు కొన్ని సోషల్ మీడియాల్లో తప్పుడు ప్రచారం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్టు జక్రియా తెలిపారు.



ఉపాధి పనుల నివేదికను ప్రజావేదికలో వివరిస్తున్న డీఆర్పీలు

ఉపాధి హామీలో గోల్‌మాల్.!?

మరిపెడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది మరిపెడ మండలంలోని 44 గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో గోల్‌మాల్ జరిగినట్లు గురువారం జరిగిన సోషల్ ఆడిట్ ప్రజా వేదికలో వెల్లడైంది. ఊరూరా ఎఫ్ఏలు గతం లాగానే మళ్లీ అవే కాకి లెక్కలతో అక్రమాలకు పాల్పడ్డట్లు బట్టబయలైంది. సోషల్ ఆడిట్ సర్వే బృందాలు పక్షం రోజులుగా మండలంలోని ఊరూరా జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ నివేదికలను గురువారం మరిపెడ మండల్ పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఇన్‌హౌస్ ప్రజావేదికలో డీఆర్పీలు జిల్లా ఉన్నతాధికారులకు పలు ఆసక్తికర విషయాలను నివేదించారు. ఎఫ్ఏలు తమ అనుయాయులకు పనులు చేయకున్నా మస్టర్ రోల్‌లో పేర్లు రాసి బిల్లులు స్వాహా చేసినట్లు వెల్లడయ్యింది. ఆనేపురంస్టేజీ, నీలికుర్తి, ఎల్లంపేట, వీరారం, ఉల్లెపల్లి, గాలివారిగూడెం తదితర గ్రామాల్లో పనులు లేకుండానే బిల్లులు పొందారు. నీలికుర్తి, ఎల్లంపేట గ్రామాల ఎఫ్ఏలను విధుల నుంచి తొలగించాలని ఆయా గ్రామాల బాధితులు డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రావు చెప్పారు. కార్యక్రమంలో డీవీసీ మన్మోహన్, ఏపీసీ అంజిగౌడ్, ఇన్‌చార్జి ఎంపీడీవో కనకదుర్గ, గతంలో పని చేసిన ఎంపీడీవో ధన్‌సింగ్, అంబుడ్స్ మేనేజర్ ఆదామ్, ఎస్ఆర్పీలు చెన్నకేశవులు, కొమురయ్య, ఏపీవో మంగమ్మ, ఎంపీవో సోమ్లానాయక్, ఎఫ్ఏలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎమ్మెస్సీ ప్రాక్టికల్ తరగతులు

కేయూ క్యాంపస్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కేయూ దూరవిద్య కేంద్రం 2023-24 ఏడాదికి సంబంధించిన ఎమ్మెస్సీ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్-1 ప్రాక్టికల్ తరగతులను నిర్వహిస్తామని కేయూ ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, సైన్స్ కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకట గోపీనాథ్ గురువారం తెలిపారు. ఎమ్మెస్సీ బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగం కోర్సుల అభ్యర్థులందరూ వర్సిటీలోని ఆయా విభాగాల్లో నిర్వహించే ప్రాక్టికల్ తరగతులు ఫిబ్రవరి 1 నుంచి 8వ తేదీల్లో జరుగుతారని వెల్లడించారు. అలాగే ఫిబ్రవరి 9, 10న ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. అభ్యర్థులు తరగతులకు హాజరై పరీక్షలు రాయాలని కోరారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా కిశోర్



డాక్టర్ కిశోర్‌కు అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు

వరంగల్ మెడికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిశోర్ పూర్తి అదనపు బాధ్యతలు గురువారం స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కిశోర్‌ను టీఎన్‌జీవో హనుమకొండ జిల్లా అధ్యక్షు డు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ.. ఎంజీఎం అభివృద్ధికి, రోగు ల సంరక్షణకు, మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఇస్మాయిల్ అలీ, లక్ష్మీప్రసాద్, రవికుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

గోదాముల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ నాగేశ్వర్‌రావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాయల నాగేశ్వర్‌రావు

హనుమకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గోదాముల నిర్వహణతో పాటు అందులో నిల్వల రికార్డులు సక్రమంగా ఉండాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో వరంగల్ రీజియన్ పరిధిలోని గిడ్డంగుల సంస్థల మేనేజర్లతో నాగేశ్వర్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిడ్డంగుల నిర్వహణపై వారికి పలు సూచనలు చేశారు. గోదాముల్లో బాగా కష్టపడి పని చేసేవారిని గుర్తించి వారికి ప్రోత్సాహం ఇస్తామన్నారు. గోదాముల్లోని నిల్వలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, గోదాముల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. గోదాముల్లో ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. గోదాములను ఎప్పటికప్పుడు ఆకస్మికంగా తనఖీలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ ఎండీ కొర్ర లక్ష్మి, జనరల్ మేనేజర్లు ఆనంద్ కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మానుకోటలో యువకుడి ఆత్మహత్య

మృతుడి స్వస్థలం ఏపీలోని విశాఖపట్టణం

మహబూబాబాద్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస సెంటర్‌లోని శివప్రియ లాడ్జ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్టణానికి చెందిన యువకుడు మనస పతంజలి పవన్ ప్రేమ్‌కుమార్ (31) గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు టౌన్ ఎస్సై శివకుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్టణం జిల్లా నర్సీపట్నంలోని చాకలి కాలనీకి చెందిన పవన్ ప్రేమ్‌కుమార్ బుధవారం మధ్యాహ్నం 12.25 గంటలకు శివప్రియ లాడ్జ్‌లోని రూమ్ నెంబర్ 107ను అద్దెకు తీసుకున్నాడు. లాడ్జ్ యాజమానికి ఎస్ఎస్‌సీ పరీక్ష ఉందని, అందుకే విశాఖపట్టణం నుంచి ఇక్కడికి వచ్చానని తెలిపినట్టు చెప్పారు. పవన్ ప్రేమ్‌కుమార్‌కు మూడు నెలల క్రితం వివాహం అయినట్లు తెలిసింది. తల్లిదండ్రులు వస్తే కానీ పవన్ ప్రేమ్ కుమార్ ఎందుకు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందో.. వివరాలు తెలుస్తాయని ఎస్సై పేర్కొన్నారు. కాగా, మృతుడి వద్ద సెల్‌ఫోన్ లేకపోవడంతో సమాచారం ఆలస్యమవుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. పేయల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2525	2130
పల్లికాయ (సూకి)	6300	4600
పల్లికాయ (పచ్చిది)	5400	3100
పత్తి	7010	5800
పసుపు (కాడి)	-	-
ఎల్లో మిర్చి	16500	13500
తేజ మిర్చి	13500	9000
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్ 341	14500	11500
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

క్వింటా మిర్చిని రూ.25 వేలకు కొనాలి

తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన



వ్యవసాయ మార్కెట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : క్వింటా మిర్చి రూ.25 వేలకు కొనుగోళ్లు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తూ గురువారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ మాట్లాడారు. మార్కెట్‌లో క్వింటా మిర్చిని అధికంగా రూ.13 వేలకే కొనుగోలు చేయడ దారుణమని విమర్శించారు. భారీ ఎత్తున మిర్చి మార్కెట్‌కు తరలివస్తున్నప్పటికి ధరను నామమాత్రం ధరలకే కొనుగోలు చేస్తున్నారని అన్నారు. గత ఏడాది క్వింటా మిర్చి రూ.24 వేలధర పలికిందని చెప్పారు. ఓ వైపుమిర్చి 35-40 క్విం టాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 15-20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోందని దాంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. వ్యాపారులు, దళారులతో అధికారులు కుమ్మక్కై మిర్చి రైతును చిత్తు చేస్తున్నారని విమర్శించారు. కోల్డ్ స్టోరేజ్‌లలో దాచుకుందామనుకున్న వ్యాపారులు, కమిషన్ ఏజెంట్‌లే తిష్ట వేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దళారి వ్యవస్థను నివారించాలని అందుకు గాను అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలన్నారు. కోల్డ్ స్టోరేజ్‌లలో కూడ తనిఖీలు నిర్వహించాలని, తక్షణమే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి మిర్చి ని కొనుగోలుచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న, అధ్యక్షులు గునిగంటి రాజన్న, ఉపాధ్యక్షులు నల్లపు సుధాకర్, పల్లా ప్రభాకర్‌రెడ్డి, బయ్య సోమన్న, నీరుటి జలేందర్, కట్ల కృష్ణయ్య, బానోత్ రమేష్, వెంకన్న, పలగుజ్జు రామ్మూర్తి, అంగోత్ ఇస్తా, రామసాని రాంరెడ్డి పాల్గొన్నారు.



కేయూలో పదవుల పందేరం

• రిజిస్ట్రార్ సహా కీలక పదవులకు కొత్త ముఖాలు • ఎస్సీ ప్రొఫెసర్‌కు రిజిస్ట్రార్ పోస్టు ఇచ్చే చాన్స్
• పరిపాలన పదవుల్లో కొందరికీ ఎప్పుడూ మొండిచెయ్యే • సీఎంతో కీలక భేటీ నేపథ్యంలో పోస్టుల భర్తీ ఆలస్యం

కేయూ క్యాంపస్ జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో నూతన పరిపాలన అధికారులు త్వరలోనే పగ్గాలు చేపట్టనున్నారు. రిజిస్ట్రార్‌తో సహా ఇతర కీలక పదవులన్నింటినీ సమర్థులతో భర్తీ చేసేందుకు వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఇప్పటికే సమాలోచనలు చేసినట్లు సమాచారం. అయితే ఎవరు ఏ పోస్టుకు సరిపోతారనే అంశంలో కొంత సంశయంలో ఉన్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక భేటీ నేపథ్యంలో ఇప్పటికిప్పుడు పరిపాలన పదవుల భర్తీ విషయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. అయితే వీసీ ఓసీవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో కచ్చితంగా ఎస్సీ వర్గానికి చెందిన ప్రొఫెసర్‌కే రిజిస్ట్రార్ పదవి వస్తుందని వర్సిటీలో జోరుగా చర్చ నడుస్తోంది. రిజిస్ట్రార్‌తో పాటు మరిన్ని కీలక పదవులైన కేయూ డెవలప్‌మెంట్ ఆఫీసర్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సీడీసీ అకడమిక్ డీన్, సీడీసీ అకడమిక్ ఆడిట్ డీన్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్, కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ, కేయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, హాస్టల్స్ డైరెక్టర్‌తో పాటు ఇతర కీలక పదవుల్లోకి కొత్తగా పలువురు ప్రొఫెసర్లతో భర్తీకానున్నాయి. ఇప్పుడున్న పరిపాలన అధికారులందరూ గతంలో నియమించబడిన వారు కావడంతో వారందరి పదవులలో మార్పులు, చేర్పులు చేయనున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వర్సిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో వర్సిటీల్లో పెండింగ్ విషయాలపై ఎప్పటికప్పుడు రాష్ట్ర ఉన్నత విద్య మండలి, ఉన్నత విద్య కమిషనరేట్ కార్యాలయ అధికారులు సమీక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు నివేదికలు కోరుతున్నారు. వర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బంది విషయంలోనూ నిబంధనలను విధిస్తున్నారు. వర్సిటీల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండంతో వర్సిటీలో పరిపాలన, అకడమిక్ అధికారుల పాత్ర రానున్న కాలంలో మరింత కీలకం కానుంది.

ఆశావహుల ఎదురుచూపులు

కాకతీయ యూనివర్సిటీలో 409 మంది ప్రొఫెసర్ల పోస్టులకుగాను ప్రస్తుతం 76 మందే రెగ్యులర్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. గతంలో పనిచేసిన కీలకమైన ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ పొందారు. వారి స్థానంలో 2010 తర్వాత నుంచి వర్సిటీలో రెగ్యులర్ నియామకాలు జరగలేదు. 15 ఏళ్లకాలంలో పోయే వారే తప్ప.. వచ్చే వారు కరువయ్యారు. దీంతో వర్సిటీలో తీవ్రమైన ప్రొఫెసర్ల కొరత ఏర్పడింది. 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల బ్యాచ్‌లో 32 మందికి కోర్టు కేసుల నేపథ్యంలో ఇంక్రిమెంట్లతో పాటు పదోన్నతులను ఇవ్వలేదు. దీంతో వారికి వర్సిటీలో పరిపాలన పదవులు అందని ద్రాక్షలాగే మారాయి. గత వీసీ కాలంలో ఒక్కరిద్దరి పైరవీలకు తలొగ్గి వర్సిటీలో పరిపాలన పోస్టులు కట్టబెట్టినప్పటికీ తర్వాత తొలగించారు. 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల కేసు విషయం తెలితే వారికీ పరిపాలన పదవులను కేటాయించే అవకాశాలున్నాయి. ఇప్పుడున్న ప్రొఫెసర్ల కంటే అధికంగా వర్సిటీలో పరిపాలన పదవులు ఉండడంతో దాదాపు అందరికీ పదవులు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే పలుకుబడి కలిగిన వర్సిటీ పదవుల కోసం ప్రొఫెసర్ స్థాయి వ్యక్తులందరూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి దృష్టిలో పడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే పదవుల కోసం పైరవీలకు దిగుతున్నారు.

అసంతృప్తి సెగలు

కాకతీయ యూనివర్సిటీలో ప్రొఫెసర్లకు పదవుల పంపిణీపై అసంతృప్తి సెగలు కమ్ముకున్నాయి. వర్సిటీలో పదవులు వచ్చినోళ్లకు వస్తున్నాయని, రానివారికి ఏమీ రాకపోవడంతో పలువురు ప్రొఫెసర్లలో అసంతృప్తి నెలకొంది. కొందరు సర్వీస్‌లోకి వచ్చినప్పటి నుంచి దాదాపు ఏళ్లుగా పరిపాలన పదవుల్లోనే కొనసాగుతున్నారు. వర్సిటీలో పలువురు ప్రొఫెసర్లకు పదవులేమీ కావడం లేదు. పరిపాలన పదవులు నిర్వహించని వారికి వర్సిటీలో ఉద్యోగ విరమణ సమయంలో పలు బెనిఫిట్స్ లభిస్తాయి. దీంతో పదవులకు డిమాండ్ పెరుగుతోంది. వర్సిటీలో కీలకమైన డిపార్టుమెంట్లలో పనిచేసే ప్రొఫెసర్లలో సగానికి కంటే ఎక్కువ మంది పరిపాలన పదవుల్లో కొనసాగుతున్నారు. పదవుల్లో ఉన్న ప్రొఫెసర్లు పాఠాలు చెప్పే తీరిక దొరకడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. దీంతో అకడమిక్ వాతావరణం దెబ్బతింటోంది. వర్సిటీలో పదవులు కొందరు ప్రొఫెసర్లకే ఇచ్చి మరికొందరికీ మొండి చెయ్యి చూపడం పట్ల విమర్శలు వెల్లువెత్తున్నాయి.

వర్సిటీ పదవులు ఇలా..

మ్యాథ్స్ విభాగంలో ఆరుగురికి.. నలుగురు పదవుల్లో ఉండగా జువాలజీలో నలుగురికి.. ముగ్గురు పదవుల్లో కొనసాగుతున్నారు. కెమిస్ట్రీలో ఆరుగురికి ముగ్గురు, కామర్స్‌లో నలుగురికి ఇద్దరు, కంప్యూటర్ సైన్స్‌లో నలుగురికి ఒక్కరు, జియాలజీ, ఎకానమిక్స్‌లో ఉన్న ఒక్కొక్కరు, ఫార్మసీలో ఏడుగురికి ఒక్కరు పరిపాలన పదవుల్లో కొనసాగుతున్నారు. వీరంతా పదవుల్లో ఉంటే విద్యార్థులకు పాఠాలు, పరిశోధన ఎలా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇదిలా ఉండగా, ఇంకా పాలక మండలి సభ్యులుగా, డీన్లు, ప్రిన్సిపాల్స్, హెడ్స్ తదితర అకడమిక్ పదవుల్లోనూ మరికొందరు ప్రొఫెసర్లు కొనసాగుతున్నారు.

కీలకం కానున్న ఓఎస్డీ పోస్టు

గతంలో కేయూలో ఎప్పుడూ లేని ఓఎస్డీ పోస్టును తాజాగా తెస్తున్నారు. వర్సిటీలో ఓఎస్డీ పోస్టుకు రాష్ట్రఫైనాన్స్ సెక్రటరీ అభ్యంతరాలు లేవనెత్తినప్పటికీ వర్సిటీ పాలకమండలి సైతం ఆమోదం తెలిపింది. వర్సిటీలో వీసీ- రిజిస్ట్రార్‌ల మధ్య స్థంగా ఓఎస్డీ పని చేస్తారు. పాలక మండలి, వీసీ నిర్ణయాలను రిజిస్ట్రార్ అమలు చేస్తారు. అయితే మధ్యలో ఓఎస్డీ పోస్టు అవసరమా? అనే అభ్యంతరాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు వర్సిటీలో ఎప్పుడు ఓఎస్డీ పోస్టే లేదు కదా.. అని వర్సిటీలో అందరూ చర్చించుకుంటున్నారు. తాజాగా వర్సిటీలో ఓఎస్డీ పోస్టును భర్తీ చేయనుండటంతో ఓఎస్డీ కీలకంగా మారనున్నారు. అయితే వర్సిటీ ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఓఎస్డీ పోస్టు అనవసరమనే భావన వర్సిటీలో నెలకొంది.

సీఎంతో భేటీ అనంతరమే ప్రకటన



వర్సిటీల డీపీఆర్ (డిటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు)లను తయారు చేయాలని గతంలోనే సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్సిటీల వీసీలకు ఆదేశాలు ఇచ్చారు. వర్సిటీల్లో ఇప్పుడున్న సిబ్బంది మొదలుకుని వర్సిటీలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలన్నీ తమకు డీపీఆర్ రూపంలో పకడ్బందీగా సమర్పించాలని సూచించారు. వర్సిటీలో వీసీ డీపీఆర్‌ల ఏర్పాటుకోసం కేయూ జియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసి డీపీఆర్‌ను సిద్ధం చేశారు. గతంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజులు కేయూ డీపీఆర్‌లను సమీక్షించారు. గతంలో సంక్రాంతి పండగకు ముందే సీఎం - వీసీల భేటీ షెడ్యూల్ ఉండగా, మళ్లీ ఎప్పుడు ఉంటుందనేది తెలియరాలేదు. సీఎం రేవంత్‌రెడ్డితో వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి డీపీఆర్‌ల భేటీ ముగిసిన తర్వాత వర్సిటీలో నూతన పరిపాలన అధికారుల నియామకాల ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అయితే సీఎం రేవంత్‌రెడ్డి భేటీ ఆలస్యం జరిగితే వీలైనంత త్వరలోనే కొత్త అధికారుల నియామకాల ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయి.

నిబంధనలు పాటించు.. క్షేమంగా జీవించు..

రోడ్డు భద్రతా నియమాలపై అందరికీ అవగాహన అవసరం

ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణం ఎంతో ముఖ్యం

రోడ్డు ప్రమాదాల పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నేటితో ముగియనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

నెలరోజుల పాటు విస్తృతంగా కార్యక్రమాల నిర్వహణ



ఉర్సుగుట్ట వద్ద ట్రాలీ ఆటోకు రేడియం స్టిక్కర్ వేయిస్తున్న ఎంపీఐ శోభన్‌బాబు(ఫైల్)

ఖిలావరంగల్ / వర్ధన్నపేట రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): 'సెల్‌ఫోన్ కంటే ప్రాణం విలువైంది. హెల్మెట్ కంటే మన తల ఖరీదైంది. కారులోని సీటు బెల్టు మన ప్రాణాలను రక్షిస్తుంది' అంటూ పోలీసులు, రవాణాశాఖ అధికారులు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. వీటిని వాహనదారులు గుర్తించినప్పుడే రోడ్డు ప్రమాదాలు, మృతుల సంఖ్య తగ్గుతుందని.. అందుకే 'రోడ్డు నిబంధన పాటించు.. క్షేమంగా జీవించు' అంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 1న ప్రారంభమైన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు శుక్రవారంతో ముగుస్తున్నాయి. ఈ క్రమంలో పోలీసులు అధికారులు వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా పెరిగిన వస్తున్న చెట్ల పొదలను తొలగింపజేశారు. ద్విచక్ర వాహనంపై వెళ్లే వాహనదారులను నిలిపి గులాబీ పువ్వులు ఇచ్చి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. 'మీ క్షేమమే.. మా ధ్యేయం' అంటూ తలకు హెల్మెట్లను పెట్టి అవగాహన కల్పించారు. ర్యాలీలు నిర్వహించారు. పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ నియమాల గురించి పోస్టర్లు, కరపత్రాలు, సామాజికమాధ్యమాలు, కళాజాత, అవగాహన సదస్సుల ద్వారా వివరించారు. డ్రంకెన్ డ్రైవ్‌లు పెట్టి మద్యం తాగి వాహనాలు నడిపే వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

శిరస్త్రాణమే శ్రీరామ రక్ష

వాహనదారులు శిరస్త్రాణమే శ్రీరామ రక్ష అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హెల్మెట్ ధరించని వారిని హెచ్చరించడం, సీటు బెల్టు పెట్టుకోని సూచించడం లాంటివి చేశారు. అయినా సరే చాలా మంది వాహనదారుల్లో పెద్దగా మార్పు రావడం లేదు. నిత్యం ట్రాఫిక్ కూడళ్లలో, హైవేల్లో కూడా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నారు. కొంత మంది హెల్మెట్‌లో సెల్‌ఫోన్ ఫిక్స్ చేసి మాట్లాడుకుంటూ వెళ్తున్నారు. కారు నడిపే వ్యక్తులు సీటు బెల్టు పెట్టుకోకుండా కారు నడిపే దృశ్యాలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. సీటు బెల్టు లేకపోవడం వలన సైతం తలకే ఎక్కువగా గాయాలై మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయి. కొన్ని కొన్ని సార్లు బెలూన్లు ఓపెన్ కాకపోతే ప్రాణాలు నిలవడం కష్టమే. పోలీసులు, రవాణాశాఖ, ఇతర అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్ని కొత్త కార్యక్రమాలు తీసుకువచ్చినా తుదిగా పాటించాల్సింది ప్రజలే. ముఖ్యంగా బైక్, కారు నడుపుతున్నప్పుడు స్పీడు ఎక్కువగా పోవడం, హెల్మెట్, సీటు బెల్టు లేకుండా డ్రైవ్ చేయడం వలన ఈ మధ్యకాలంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించడంతో పాటు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలకు గురైనప్పుడు జీవితాంతం బాధ పడాల్సి వస్తోందని చెపుతున్నారు.



వర్ధన్నపేటలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

రోడ్డు భద్రతా నియమాల్లో ప్రధానమైనవి..

- ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా శిరస్త్రాణం (హెల్మెట్) ధరించాలి. మితిమీరిన వేగంతో వెళ్లొద్దు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలి. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ గుర్తులను అనుసరిస్తూ ప్రయాణికులు సురక్షితంగా రోడ్లపై తమ గమ్యస్థానాలకు చేరుకోవాలి.
- వాహనాన్ని నడిపేటప్పుడు సెల్‌ఫోన్లను ఉపయోగించకూడదు.
- కారులో ప్రయాణించేటప్పుడు డ్రైవింగ్ చేసే వారితో పాటు మిగిలిన వారు కూడా సీటు బెల్టును ధరించాలి.
- రోడ్డుపై ఒక వాహనానికి.. మరో వాహనానికి మధ్య 50 అడుగుల దూరం ఉండాలి.
- మద్యం తాగి వాహనం నడపడం నేరం. ఇక ట్రిబుల్, ర్యాష్ డ్రైవింగ్ ప్రమాదానికి కారణమవుతుంది.
- ఇక పాదచారులు రోడ్లపై నడిచేటప్పుడు ఎడమవైపునుంచి ఫుట్‌పాత్ పై నుంచి నడవాలి. రోడ్డును దాటాల్సి వచ్చిన క్రమంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద, జీబ్రాక్రాసింగ్‌ల వద్ద మాత్రమే రోడ్డు దాటాలి.

అందరినీ చైతన్య పరుస్తున్నాం..



టి. జయపాల్‌రెడ్డి. సీనియర్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్, వరంగల్.

జాతీయ రోడ్డు భద్రతామాసోత్సవాలలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతా నిబంధనలు తెలిసేలా, అందరిలో చైతన్యం కలిగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలను నడపడం వల్ల జరిగే పరిణామాలు, శిరస్త్రాణం లేకుండా బైకులు నడిపితే ప్రమాదాల బారిన పడే అవకాశాల గురించి తెలియజేశాం. ఇంజనీరింగ్ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు ట్రిబుల్ రైడింగ్, ర్యాష్‌డ్రైవింగ్ తదితర కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు మినీ టెలీఫిలింను ప్రదర్శించాం. వరంగల్ జిల్లాలో రద్దీగా ఉండే ప్రాంతాలు, కూడళ్లు, రోడ్లపై రేడియం స్టిక్కర్లు, జీబ్రాక్రాసింగ్, తదితర గుర్తులను ఏర్పాటు చేస్తున్నాం. పోలీసులు, ఆర్టీఏ అధికారులు, సిబ్బందితో కలిసికట్టుగా ఈ మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాం.

అవగాహనతో ప్రమాదాల నివారణ



బి.చందన్, ఎస్‌ఐ, వర్ధన్నపేట

అవగాహనతోనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది. ప్రతీ ఒక్కరు పోలీసులు, రవాణాశాఖ అధికారులు సూచించే భద్రతా నియమాలను పాటించాలి. రోజు రోజుకు రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారి సంఖ్య ఎక్కువ కావడం అందరినీ కలిచివేస్తోంది. దీని పట్ల కనీస అవగాహన లేకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో వర్ధన్నపేట మండలంలో రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రజలను చైతన్య పరచడంతో పాటు డ్రైవర్లను కూడా చైతన్యవంతులను చేస్తున్నాం. ఆర్థిక, సామాజిక, సైబర్ నేరాల అదుపునకు ప్రత్యేక కార్యాచరణ చేస్తున్నాం. మద్యం తాగి వాహనాలు నడపడం, మైనర్లు రోడ్లపై బైకులు వేసుకుని తిరగడాన్ని కఠినంగా పరిగణిస్తాం.



సంకీర్తనా మండలి సమావేశంలో ప్రసంగిస్తున్న త్రిదండి చినజీయర్‌స్వామి, వేదికపై మేయర్ గుండు సుధారాణి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వికాసతరంగిణి ప్రతినిధులు

నగరం.. ఆధ్యాత్మిక సౌరభం



• నగరంలో నేత్రపర్వంగా శోభాయాత్ర • అలరించిన భక్తి కళాప్రదర్శనలు
• ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తరలివచ్చిన కళాకారులు

హనుమకొండ కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు నగరం గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తరలివచ్చిన కళాకారుల కళాప్రదర్శనలతో హోరెత్తిపోయింది. వికాస తరంగిణి వరంగల్, హనుమకొండ శాఖల ద్వారా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ నుంచి సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల వరకు సంకీర్తన మండలి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణిలతో కలిసి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ర్యాలీని ప్రారంభించారు. భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు, సిద్దిపేట తదితర జిల్లాల నుంచి ప్రాచీన కళారూపాలైన బోనాలు, కోలాటాలు, నృత్య ప్రదర్శనలతో ఒక్కో కళారూపం ఒక్కో రకంగా ఏకరూప దుస్తులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. వరంగల్ నగరానికి చెందిన వికాస తరంగిణి కార్యకర్తలు మంగళ హారతులతో ర్యాలీలో పాల్గొన్నారు. కిలోమీటర్ల పొడవునా ర్యాలీ నేత్రపర్వంగా కొనసాగిన క్రమంలో పలు చోట్ల ట్రాఫిక్ అంతరాయం కలిగింది. అయినా కళాకారులు ఉత్సాహంతో సంకీర్తనను ఆలపిస్తూ మిన్నంటే జైశ్రీమన్నారాయణ నినాదాలతో నృత్యాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఓరుగల్లు నగర చరిత్రలో ఆధ్యాత్మిక సౌరభంతో కూడిన అతి పెద్ద ర్యాలీగా సంకీర్తన మండలి ర్యాలీ కొనసాగింది.

హిందూ ధార్మిక విలువలను విస్తరింపజేయాలి..

భక్తి కళాసంఘాల ద్వారా హిందూ ధార్మిక విలువలను విస్తరింపజేయాలన్న లక్ష్యంతో తన ఆలోచనల ప్రతిరూపంగా సంకీర్తన మండలి ఆవిర్భవించిందని, దాని తొలి కార్యక్రమానికి వేదికగా ఓరుగల్లు నగరం నిలిచిందని పరమహంస పరివ్రాజక ఆచార్యుడు, సమతామూర్తి స్థాపకుడు, పద్మభూషణ్ చిన్నజీయర్‌స్వామి అన్నారు. 2001 సంవత్సరంలో కృష్ణం వందే జగద్గురుమ్, 2003 గీతా జ్యోతి కార్యక్రమాలకు ఓరుగల్లే వేదికగా ప్రారంభమై తెలుగు రాష్ట్రాల్లో విస్తరించాయని, అదే ఆనవాయితీగా తమ సంకీర్తనా మండలి హైందవ భక్తి కళామార్గాన్ని కూడా వరంగల్ నుంచే ప్రారంభింపజేస్తున్నట్లు ఆయన హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ప్రాచీన కళారూపాలను గౌరవించడంతోపాటు కళాకారులను ప్రోత్సహిస్తూ భావితరాల వారికి కళారూపాలను పదిలపర్చేందుకోసమే ఈ సంకీర్తన మండలి పని చేస్తుందన్నారు. ప్రతీ ఒక్కరిలో మానసిక శక్తిని పెంపొందింపజేసేవి సంకీర్తనేనని, వాటితోపాటు కళారూపాలు కూడా ప్రతీ మనిషిలో చైతన్యం నింపుతాయన్నారు. ప్రతీ కళారూపంలోనూ దైవత్వం దాగి ఉంటుందని, అందుకే ఏ కళారూపాన్ని తీసుకున్నా ధార్మిక చింతన ఉంటుందని చెబుతూ ప్రతీ కళారూపాన్ని ఈ తరం యువతకు అందజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. అనేక సంప్రదాయాల సమాహారమే హైందవ ధర్మమని, భగవంతుడితో భక్తుడికి అనుసంధాన సాధనం భక్తి మార్గమని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు ఓరుగల్లు నగరం భక్తి ప్రవాహంలో మునిగిందని, చిడతలు, డప్పులు, కోలాటం, నృత్యం లాంటి ప్రదర్శనలు ఎన్నో తనకు ఆనందంగా కలిగింపజేశాయని చినజీయర్ స్వామి అన్నారు. ప్రతీ ఒక్కరిని భక్తిరసంలోకి తీసుకెళ్లి ఓలలాండింపజేసే గుణం ప్రతీ కళకు ఉంటుందన్నారు. అందులోని సాహిత్యాన్ని తీసుకొని కళారూపాన్ని సజీవంగా ప్రదర్శింపజేసేందుకు చదువు రాకున్నా కళాకారుల ప్రతిభ అద్భుతమని కితాబిచ్చారు. ఇక నుంచి సంకీర్తన మండలిని తెలుగు రాష్ట్రాల్లో విస్తరింపజేస్తామన్నారు.

తొలుత దేవనాద జీయర్ స్వామి అధ్యక్షపాన్యాసం చేస్తూ.. ఆధ్యాత్మిక పునాదులపై సామాజిక సేవతోపాటు భక్తి కళామార్గం రూపొందించేందుకు ఓరుగల్లు వేదికగా కార్యక్రమం నిర్వహించడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ఓరుగల్లుకు స్వామివారి రాకతోపాటు కళారూపాల ప్రదర్శన ఉమ్మడి జిల్లా నుంచి వేలాదిగా తరలివచ్చిన కళాకారులతో పర్వదిన సందడి కనిపిస్తోందన్నారు. నేపాల్ కృష్ణమాచార్య, నముద్రాల శఠగోపాచార్య, నాయిని నీలిమా రాజేందర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆచార్య పి.జ్యోతి, వికాస తరంగిణి కేంద్ర కమిటీ సభ్యులు మహేందర్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. వరంగల్, హనుమకొండ వికాస తరంగిణిల చైర్మన్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, మురళీకృష్ణతో పాటు వికాస తరంగిణి నిర్వాహకులు చాడ సుభాష్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, మురళీధర్‌రావు, తిరుమల్, ఉమా, ఆచార్య జ్యోతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వేదిక వద్ద తిరుమలగిరి నుంచి గంగిరెద్దులతో తరలివచ్చిన కళాకారుల విన్యాసాలను స్వామి ఆసక్తిగా తిలకించారు. గోమాత ప్రత్యేకతను తెలియచెబుతూ దానికి ఆహారాన్ని అందించారు. గిరిజన సంప్రదాయ ప్రదర్శన, చిన్నారుల కోలాట నృత్య ప్రదర్శన, చిందు యక్షగానం, కూచిపూడి కళా నృత్య ప్రదర్శనలు దేనికదే ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి. ఈ కార్యక్రమం ప్రారంభంలో హనుమాన్ చాలీసాపై స్వామివారితో సహా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు చేసిన నృత్యంతో ఓరుగల్లు ఓలలాడింది.



కోలాటం ఆడుతూ భజనలు చేస్తున్న మహిళలు

మహాత్ముడికి ఘన నివాళి



ములుగులో గాంధీకి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



భూపాలపల్లిలో గాంధీజీకి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

ములుగు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం జిల్లాకేంద్రంలో జరుపుకున్నారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎమ్డీ.చాంద్‌పాషా, నాయకులు నల్లెల భరత్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

● మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లలో వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. వాసవిక్లబ్, వైశ్యసంఘం సభ్యులు కుక్కుడపు వెంటేశ్వర్లు, రేపాల హరీష్, రేపాల ధనుంజెములు, ఒల్లాల రమేష్, ఒల్లాల నాగరాజు, యెల్లారి శ్రీనివాస్, కుక్కుడపు అశోక్, కుక్కుడపు సత్యనారాయణ, యంసాని రవిచంద్ర, రేపాల శరత్, గుండ నరేష్, ఎంపీడీవో, ఉపాధిహామీ కార్యాలయ అధికారులు, గ్రామస్థులు బండి స్వామి, చంద్రమౌళి పాల్గొన్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్యవైశ్యసంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ విగ్రహానికి ఎస్సై అభినవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని పలు ప్రజాసంఘాల నాయకులు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఆర్య వైశ్యసంఘ జిల్లా, మండలనాయకులు అనంతుల శ్రీనివాస్, అనంతుల రమేష్, మద్ది లక్ష్మీనర్సింహామూర్తి, మనోహర్, కలికోట శ్రీనివాస్ అల్లాడి శ్రీనివాస్, చంద్రమౌళి, మహేష్, కముటాల రవీందర్, రమేష్, ప్రకాష్, అశోక్, అంజయ్య, నగేష్, శ్రీను, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● భూపాలపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలో నిర్వహించిన మహాత్మా గాంధీ వర్ధంతిలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గురువారం పాల్గొన్నారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, కొమురయ్య, శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

● కాకతీయఖని (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. భూపాలపల్లి ఏరియా జీఎం కార్యాలయంలో ఇన్‌చార్జి జీఎం వెంకట్రామిరెడ్డి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అధికారులు కవీంద్ర, జ్యోతి, మురళీమోహన్, మారుతి, శైలేంద్రకుమార్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జాతిపిత గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సభలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో వెంకటేశ్వర్లు, డీపీఎంలో సత్యనారాయణ, వైద్యులు మహేందర్, మధుకర్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని పురవిధుల్లో గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని యాంటీ లెప్రసీ డేను నిర్వహించారు. హెచ్ఎస్‌లు వెంకటరమణ, కోటిరెడ్డి, వైద్యసిబ్బంది నాగేంద్రకుమారి, లలితకుమారి, అనూష, చిన్నవెంకటేశ్వర్లు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్వాయి గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా, నియోజకవర్గ నాయకులు, యూత్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రామప్ప హుండీ ఆదాయం రూ.6.80 లక్షలు

వెంకటాపూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రామప్ప రామలింగేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను గురువారం లెక్కించారు. దేవాదాయ శాఖ పరకాల డివిజన్ అధికారి కవిత పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగు హుండీల్లో రూ.6,41,935 కరెన్సీ నోట్లు, రూ.38,987 నాణేలు, మొత్తం రూ.6,80,922 ఆదాయం సమకూరినట్లు ఈవో ఈవో బిల్లా శ్రీనివాస్ తెలిపారు. ఆరునెలల క్రితం రూ.3లక్షల 95వేల ఆదాయం సమకూరగా ఈసారి రూ.6,80,922 వచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కోమళ్లపల్లి హరీశ్‌శర్మ, మోహనమఠం ఉమాశంకర్, పురావస్తుశాఖ కోఆర్డినేటర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో మోటార్ వెహికిల్ చట్టం, విద్యాహక్కు చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, బాలకార్మిక చట్టాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, ప్రధానోపాధ్యాయుడు కె.రాజేందర్, ఉపాధ్యాయులు పి.మల్లయ్య, ఎమ్డీ.జాఫర్‌అలీ, మదన్మోహన్, హమీద్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

వెంకటాపూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రెండురోజులపాటు నిర్వహించే కెరీర్ కౌన్సెలింగ్, గైడెన్స్ శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సమగ్రశిక్ష జిల్లా కోఆర్డినేటర్ అర్షం రాజు పేర్కొన్నారు. మండలంలోని జవహర్‌నగర్ మోడల్‌స్కూల్‌లో గురువారం కెరీర్ కౌన్సెలింగ్, గైడెన్స్ కార్యక్రమంపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం జరుగగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు కెరీర్ కౌన్సెలింగ్, గైడెన్స్‌పై శిక్షణ, అవగాహన కల్పించడం కోసం ప్రతి పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు తప్పకుండా హాజరుకావాలని అన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు ఒత్తిడిని ఎలా అధిగమించాలి, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలకు సిద్ధమవడం ఎలా, భవిష్యత్తులో ఉన్నతస్థానాలను అధిరోహించడానికి ఎలాంటి కోర్సులు ఎంపిక చేసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు కాటం మల్లారెడ్డి, సైకం శ్రీనివాసరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, రిసోర్స్ పర్సన్లు సుతారి మురళీధర్, అజ్మీరా ప్రతాప్, ఫణీందర్‌తోపాటు 53పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిల్ట్ కార్మిక జేఏసీ వైఖరిపై కరపత్రాలు

మంగపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కమలాపురంలో ఉన్న బిల్ట్ కర్మాగారం పునరుద్ధరణ విషయంలో జేఏసీ నాయకుల వైఖరిపై గురువారం కరపత్రాలు వెలిశాయి. బిల్ట్ కార్మికుల పేరుతో ముద్రించిన ఈ కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. బిల్ట్ కార్మికులను మోసం చేసిన కార్మిక జేఏసీ నాయకులు సమాధానం చెప్పాలని 10 అంశాలతో ప్రశ్నలు సంధించారు. లేదంటే కార్మిక జేఏసీ నాయకుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

● డీఎంహెచ్‌వో గోపాల్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు వైద్యులు, సిబ్బందికి సూచించారు. గురువారం ములుగులో ఆరోగ్యకేంద్రాల వైద్యులు, సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమయపాలన పాటించాలని, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించని సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో పీహెచ్‌సీల పరిధిలో ఏసీఎఫ్ క్యాంపులో ప్రణాళికలు తయారు చేసుకుని ప్రతి ఆశా కార్యకర్త పది తెమడ పరీక్షలు చేయాలని సూచించారు. టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించాలని, జాతీయ మాతా సంరక్షణ, పోషకాహార ప్రోగ్రాంలో గర్భిణుల నమోదును పెంచాలని, పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు పవన్‌కుమార్, శ్రీకాంత్, చంద్రకాంత్, రణధీర్, డెమో సంపత్, ఏఎంవో దుర్గారావు, సిబ్బంది వెంకటరెడ్డి, సురేష్‌బాబు, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

దేవాదుల పైప్‌లైన్ లీక్.. ఎగిసి పడిన నీరు



ఎగిసిపడుతున్న నీరు

వెంకటాపూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్గుపేట గ్రామ శివారు రామకృష్ణాపూర్ పరిధిలో దేవాదుల పైపులైన్ గేట్‌వాల్వ్ లీక్ అయింది. దీంతో నీరు ఉవ్వెత్తున ఎగిసిపడింది. భూపాల పల్లి జిల్లా భీమ్‌ఘన్‌పూర్ నుంచి రామప్ప సరస్సుకు ఫేస్-123 ద్వారా నీటిని తరలించేందుకు పైపులైన్‌ల నిర్మాణం చేపట్టారు. అందులో ఫేస్-2 నుంచి విడుదల అవుతున్న నీరు వరంగల్ జిల్లా శాయంపేట మండలంలోని చలి వాగుకు వెళ్తున్న క్రమంలో గురువారం ఉదయం గేట్‌వాల్వ్ లీక్ కావడంతో సుమారు మూడు గంటల పాటు నీరు ఒక్కసారిగా ఎగిసి పడింది. సమీపంలో ఉన్న పంట పొలాలు నీటితో నిండిపోయాయి. మోటార్ల నుంచి ఎక్కువ ఒత్తిడితో నీటి ప్రవాహం జరగడంతో గేట్‌వాల్వ్ లీక్ అయి నట్లు ఐబీ అధికారులు తెలిపారు. వెంటనే గేట్‌వాల్వ్‌కు మరమ్మతులు చేపట్టి నీటి దుర్వినియోగాన్ని నివారించినట్లు ములుగు ఐబీ డీఈ రవీందర్‌రెడ్డి, ఏఈ జయంతి తెలిపారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నేతలు

చిట్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం దహనం చేశారు. ఈసందర్భంగా యూత్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్ మాట్లాడుతూ ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్‌ను మంత్రివర్గం నుంచి వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు చంద్రకిరణ్, గోల్కొండ నాగరాజు, అల్లం రాజు, వెంకటేశ్, శ్రీకాంత్, సుమన్, రమణకుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీయూకేఎఫ్‌వీ జిల్లా కన్వీనర్‌గా సతీష్



కాటారం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం విద్యా విభాగం భూపాలపల్లి జిల్లా కన్వీనర్‌గా కొట్టె సతీష్‌ను నియమించారు. మండలంలోని గారెపల్లి గ్రామానికి చెందినతః మేరకు ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్ విశ్వనాదన్ నియామకపత్రం జారీ చేశారు. ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం చేయడం కోసం పలు పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాటు, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ, ఇంపాక్ట్ ఫౌండేషన్ ద్వారా మోటివేషనల్ తరగతుల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేస్తున్న సతీష్‌ను టీయూకేఎఫ్‌వీ జిల్లా కన్వీనర్‌గా నియమించారు. సతీష్ మండలంలోని గారెపల్లి గ్రామానికి చెందిన వారు. ఆయన నియాకమంపై ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ నిర్ణయంపై దళితబంధు కమిటీ హర్షం

కాటారం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): దళితబంధు నిధుల అంశంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మండలంలో గురువారం హర్షం వ్యక్తమైంది. మండల కేంద్రంలో దళితబంధు సాధన సమితి నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా దళితబంధు సాధనసమితి జిల్లా అధ్యక్షుడు సముండ్ల సంపత్ మాట్లాడుతూ దళితబంధు లబ్ధిదారులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని, గతంలోనే గ్రౌండింగ్ పూర్తయిన యూనిట్ల లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి జిల్లా ఉపాధ్యక్షుడు జక్కయ్య, నాయకులు మధుకర్, తిరుపతి, సదువలి, రామన్న, దుర్గారావు, రాజబాపు, సమ్మయ్య, శేఖర్, రమేష్, స్వామి, లస్మయ్య, వెంకటేశ్, ముత్తయ్య, సమ్మయ్య, రాజేష్, కిరణ్, మమత, అర్చన, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ దేవాలయంలో హోమం



రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహిస్తున్న హోమం

మహాముత్తారం, జనవరి30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం ప్రతిష్ఠాపనలో భాగంగా గురువారం హోమం నిర్వహించారు. సుమారు 120 గౌడ జంటలు కుటుంబ సమేతంగా ఇందులో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో పూజారులు సాయిశర్మ, సదానందాచారి, శివానందచారితో పాటు గౌడ సంఘం పెద్దలు, గీతకార్మికులు పాల్గొన్నారు.

టీపీసీసీ ఉపాధ్యక్షురాలికి సన్మానం

కాటారం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ఉపాధ్యక్షురాలుగా నియమితులైన అంగోత్ సుగుణకు పలు గ్రామాలకు చెందిన స్వశక్తి సంఘాల సభ్యులు, పలువురు మహిళా కాంగ్రెస్ నాయకులు గురువారం ఆత్మీయ పౌర సన్మానం చేశారు. మండలంలోని చింతకాని, గట్టుకుంట గ్రామాలో మహిళా కాంగ్రెస్ నాయకులు, స్వశక్తి సంఘాల సభ్యులు సత్కరించి స్వీట్లు తినిపించి అభినందించారు. మహిళా కాంగ్రెస్ నాయకులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు సమ్మక్క, లక్ష్మి, సువర్ణ బానమ్మ, సౌమ్య, రాజక్క, రాధిక, మౌనిక, దుర్గమ్మ, రాజేశ్వరి, మల్లక్క తదితరులు పాల్గొన్నారు.

అంకుసాపూర్‌లో పౌరహక్కుల దినోత్సవం

కాటారం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకుసాపూర్ జీపీ పరిధిలోని ఎస్సీ కాలనీలో గురువారం సివిల్ రైట్స్ డే (పౌర హక్కుల దినోత్సవం)ను నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, దళితసంఘాల నాయకులు హాజరై రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ఉన్న ప్రత్యేక హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగరాజు, ఎస్సై అభినవ్ మాట్లాడుతూ ప్రజలంతా అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లా ఐకమత్యంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. కుల వివక్ష చూపేవారిపై చట్ట ప్రకారం చర్యలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకటయ్య, జేపీ సతీష్, అంబేద్కర్ సంఘం నాయకులు, గ్రామపెద్దలు మంథని మధు, బాలరాజు, బోడ రాజు, లింగయ్య, రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయుల ఆలయాలను సందర్శించిన విదేశీయులు

వెంకటాపూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో విదేశీయుల గురువారం సందడి చేశారు. ఇంగ్లండ్ దేశస్థులు నిక్, లియా, లండన్‌కు చెందిన రీసెర్చ్ స్కాలర్ రోస్ మెల్విన్ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా వారు ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి గైడ్ వెంకటేశ్ ద్వారా ఆలయ చరిత్ర, విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయలు కొట్టారు.

● చిట్యాల (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నైన్‌పాక శివారు సుప్రసిద్ధ సర్వతోభద్ర ఆలయాన్ని ఇంగ్లండ్ పరిశోధకుడు రోస్ మెల్విన్ సందర్శించారు. ఉమ్మడి వరంగల్ టూరిజం అసిస్టెంట్ ప్రమోషన్ అధికారి డాక్టర్ కుసుమ సూర్యకిరణ్ ఆయనకు ఆలయ చరిత్ర, ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆలయానికి నలుదిక్కుల నాలుగు ద్వారాలు, ఏకశిలపై లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి, విష్ణుమూర్తి, శ్రీసీతారామలక్ష్మణులు, శ్రీకృష్ణుడు, రుక్మిణీదేవి దేవతామూర్తుల రూపాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారని అర్చకులు పెద్యాల ప్రభాకరాచార్యులు తెలిపారు.



కోటగుళ్లలో లండన్ పరిశోధకుడు

● గణపురం (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని కాకతీయుల కట్టడమైన శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం(కోటగుళ్లు)ను ఇంగ్లండ్‌కు చెందిన పరిశోధకుడు రోస్ మెల్విన్ సందర్శించారు. కాకతీయుల శిల్ప సంపద అద్భుతమని అబ్బురపడ్డారు. ఆయన వెంట పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లునాయక్, పర్యాటక శాఖ అధికారి సూర్యకిరణ్ ఉన్నారు.

షాపుల్లో పోలీసుల తనిఖీలు

తాడ్వాయి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దుకాణాల్లో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జాగిలంతో పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలను గుర్తించేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది, డాగ్‌తో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై జగదీశ్వర్‌రెడ్డి, పోలీసులు, ప్రత్యేక సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ మండల అధ్యక్షుడి ఎన్నిక

చిట్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడిగా మొగులోజు భగవతాచారి ఎన్నికయ్యారు. సంఘం సభ్యుల సమావేశం జిల్లా అధ్యక్షుడు అకునూరి సతీష్ అధ్యక్షతన గురువారం మండల కేంద్రంలో జరిగింది. ప్రధానకార్యదర్శిగా తిరుమల రాజమొగిలీచారి, ఉపాధ్యక్షులుగా పోలోజు సతీష్‌చారి, కార్యదర్శులుగా కల్వచర్ల కృష్ణమూర్తి, ములుకోజు రమేష్‌చారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోతుగంటి చంద్రమొగిలిని ఎన్నుకున్నారు

కొండపర్తిలో అభివృద్ధి పనులు పరిశీలించిన కలెక్టర్

తాడ్వాయి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత గ్రామమైన కొండపర్తిలో జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ దివాకర గురువారం పరిశీలించారు. రెండు భారీ షెడ్ల నిర్మాణ పనులు, పాఠశాల మరమ్మతులు, సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాట్లు, డ్రెయినేజీ, సీసీ రోడ్ల పనులు కొండపర్తిలో జరుగుతున్నాయి. వాటిని కలెక్టర్ పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఆయన వెంట పలు శాఖల అధికారులు ఉన్నారు.

హత్య కేసులో మరొకరి అరెస్టు

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భర్తకు విషమిచ్చి హత్య చేసిన కేసులో మరొకరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్ ఈ మేరకు గురువారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధి ఖాశీంపల్లి శివారు బాలాజీనగర్‌కు చెందిన కందుల సురేష్‌ను ఆయన భార్య కందుల స్వప్న చేపల కూరలో విషమిచ్చి హత్య చేసింది. ఈ ఘటన నాలుగు రోజుల క్రితం చోటుచేసుకోగా బుధవారం ఆమెను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ హత్యకు ప్రేరేపించిన జవహర్‌నగర్‌కు చెందిన కుంట్ల స్వామిని కూడా పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్వప్న, స్వామి మధ్య వివాహేతర సంబంధమే సురేష్ హత్యకు దారి తీసిందని పోలీసుల విచారణలో వెల్లడైంది. వివాహేతర సంబంధానికి అడ్డున్నాడనే నెపంతో ఆయన్ను స్వామి ప్రోద్బలంతో స్వప్న హత్య చేసిందని వెల్లడైంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రాజేష్ (ఫైల్)

గణపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పరకాల- భూపాలపల్లి జాతీయ ప్రధాన రహదారి గణపురం కుందూరుపల్లి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుందూరుపల్లికి చెందిన బానోతు రాజేష్ (23) కేటీపీపీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో కుందూరుపల్లి వద్ద రాజేష్ ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు అతడిని వెంటనే వంద పడకల ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

బీఆర్ఎస్ వినూత్న నిరసనలు



ములుగులో బీఆర్ఎస్ నేతల నిరసన



రేగొండలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

ములుగు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై వినూత్న నిరసన తెలుపుతూ జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి గురువారం వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, నాయకులు గొర్రె సమ్మయ్య, విజయ్‌రాంనాయక్, మహేష్, సాగర్, రఘు, రమణయ్య, బాబు, పాలెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● రేగొండ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించి వినూత్న నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాపిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు రూపిరెడ్డి చంద్రారెడ్డి, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కొలెపాక బిక్షపతి, నాయకులు మాదాడి కర్నాకర్‌రెడ్డి, గోగుల చంద్రాకర్‌రెడ్డి, ఏనుగు లింగారెడ్డి, బండి రమేష్, రత్నాకర్, ముద్దమల్ల సమయ్య, కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు అనూప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీఆర్ఎస్ నేతలు మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. మహదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, యువజన విభాగం మండల అధ్యక్షుడు ఎం.డి.అలీమ్‌ఖాన్, జిల్లా గ్రంథాలయ మాజీ డైరెక్టర్ వెన్నంపల్లి మహేష్, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కూరతోట రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

● భూపాలపల్లి కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీ ఉన్న గాంధీజీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించి వినూత్న నిరసన తెలిపారు.

● గణపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూరు ప్రధాన రహదారిపై గాంధీజీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రాన్ని సమర్పించి నిరసన తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు మోతె కర్నాకర్‌రెడ్డి, చెల్పూరు మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, రజియా, రజిత, రవీందర్, కుమారస్వామి, శ్రీనివాస్‌రావు, సంపత్, రమేష్, శ్రీను, హరినారాయణ, రాజకుమార్, హఫీజ్, నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

● గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ నాయకుడు భూక్య జంపన్న ముఖ్య అతిథిగా పాల్గొని గాంధీజీ చిత్రపటానికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈకార్య క్రమంలో నాయకులు లకావత్ నర్సింహ, శ్రీనివాసరెడ్డి, అలూరి శ్రీనివాసరావు, చుక్క గట్టయ్య, భూక్య దేవా, హేమాద్రి, చందూలాల్, మోహన్, ఫక్రుద్దీన్, మల్లేష్, ఇంద్రారెడ్డి, శ్రీనివాస్, పి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గంపోనిగూడెం వైజంక్షన్ వద్ద గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నేతలు వినతిపత్రం అందజేసి వినూత్న నిరసన తెలిపారు. మంగపేట సహకార సంఘం చైర్మన్ తోట రమేష్, వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్ యాదవ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజుయాదవ్, జిల్లా నాయకులు తాటి కృష్ణ, ఖాద్రాన్ అలీ, కొమరం ధనలక్ష్మి, బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు గోస్కుల లక్ష్మి, సహకార సంఘం డైరెక్టర్లు సిద్ధంశెట్టి లక్ష్మణ్‌రావుగుప్తా, నర్సయ్యయాదవ్, ఎ. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బొడ్రాయి సెంటర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించి వినూత్న నిరసన తెలిపారు. పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎమ్డీ. ఖాజా పాషా, నాయకులు తాడూరి రఘు, సప్పిడి రాంనర్సయ్య, దన్నపునేని కిరణ్, లట్టపెటల రాజేష్, గుండేపల్లి నర్సయ్య, జాడి బోజారావు, మెరుగు వెంకటేశ్వర్లు, పర్వతాల ఎల్లయ్య పాల్గొన్నారు.

● కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కావేరి చిన్ని కృష్ణ, పూజారి కిషోర్, మఠం వెంకటేశ్, ఆలం రాంబాబు, శ్రీనివాస్, నాగ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.